ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 3 ఆగస్టు 2024


తహసీల్దారు గదిలో ఊడి పడిన శ్లాబ్

తహసీల్దారు గదిలో శ్లాబ్ ఊడిపడింది!

బిక్కుబిక్కుమంటున్న సిబ్బంది

ఓజిలి, ఆగస్టు 2:ఓజిలి తహసీల్దారు కార్యాలయంలో పనిచేయాలంటే సిబ్బంది హడలిపోతున్నారు. కార్యాలయ భవనం అన్ని గదులూ పగుళ్ల బారి శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండడమే ఇందుకు కారణం. శుక్రవారం కార్యాలయ సిబ్బంది తహసీల్దారు గది తెరిచి అప్పటికే గది శ్లాబు ఊడిపడి ఉండటంతో భయపడిపోయారు. గదికి వేసిన సీలింగ్‌తో పాటు ఊడిపడిన పెచ్చులను తొలగించారు.ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన నాంచారయ్య గత నెల 27న రిలీవ్ అయ్యారు. ఎవరికీ పోస్టింగ్ ఇవ్వకపోవడం... గదిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.కార్యాలయంలోని అన్ని గదులూ ఈనెలు పోసి పగుళ్ళిచ్చి ఉన్నాయి. దాంతోపాటు మరి కొన్ని గదుల శ్లాబులు ఊడిపడేటట్లు లేదిపోయి ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దారు గదిలోని శ్లాబు పలు ప్రాంతాల్లో ఊడిపడి ఉంది. తహసీల్దారు గదిలో శ్లాబ్ పెచ్చులూడి పడిన విషయాన్ని తెలుసుకున్న ఆర్డీవో చంద్రముని కార్యాలయానికి చేరుకుని సిబ్బందితో మాట్లాడారు. ఆయన సమాచారంతో ఆర్‌అండ్‌బీ ఏఈ చెన్నరాయుడు గదిని పరిశీలించారు. కార్యాలయంలో విధులు నిర్వహించడం ప్రమాదకరమని, మరమ్మతులు చేపట్టినా ఫలితం ఉండన్నారు.భవన పరిస్థితిపై అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా

తిరుపతి టీడీపీ పార్లమెంటు కార్యాలయం

● ప్రతి శనివారం అర్జీల స్వీకరణ

తిరుపతి (జీవకోన), ఆగస్టు 2: ప్రజా సమస్యల పరిష్కార వేదికగా తిరుపతి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు కార్యాలయం పనిచేయనుందని అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల జగన్ పాలనలో వ్యవస్థలన్నీ కుదేలయ్యాయన్నారు. అన్ని రంగాలు అవినీతిమయంగా మారాయన్నారు. భూములు విచ్చలవిడిగా కబ్జాలకు గురయ్యాయని మండిపడ్డారు. అందువల్ల తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని స్థితిలో బాధితులంతా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు కార్యాలయం వేదికగా అధ్యక్షుడు నరసింహ యాదవ్ నేతృత్వంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా కమిటీ సభ్యులంతా అందుబాటులో ఉండి అర్జీలను స్వీకరిస్తారన్నారు. వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా పార్టీ కార్యాలయం చూసుకుంటుందన్నారు. పార్లమెంటు కార్యదర్శి యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు సలహాలు, సూచనలు వస్తే వాటిని ఐటీ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి.. యువతకు ఉపాధికల్పనే ధ్యేయంగా చూస్తామన్నారు. చేజర్ల మనోహరాచారి, మునిరామయ్య, రాజయ్య చింతా రంగయ్య, అహ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

26 ప్రైవేటు ల్యాబ్స్ సీజ్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 2: జిల్లావ్యాప్తంగా నిబంధనలు పాటించని 26 ల్యాబులను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. 'ప్రైవేటు ల్యాబుల దందా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై డీఎంహెచ్‌వో శ్రీహరి స్పందించారు. నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ల్యాబులను గుర్తించి, సీజ్ చేయాలని వైద్యాధికారులకు ఆదేశించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఇందుకోసం ప్రత్యేకంగా 17 బృందాలను ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వోపాటు ఈ బృందాల్లో అధికారులు ఒక్క రోజులోనే 90 ప్రైవేటు ల్యాబులను పరిశీలించారు. వీటిల్లో నిబంధనలు పాటించని 26 ల్యాబులను సీజ్ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో ఈ చర్యలు చేపట్టామన్నారు. ల్యాబుల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లతోపాటు నిబంధనలు పాటించకున్నా, అధిక ధరలు వసూలు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.మంగళం పరిధి లో జరిగిన తనిఖీల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు జయంతి, స్రవంతి, ఎంపీహెచ్‌ఈవో మురళి, తదితరులు పాల్గొన్నారు.

దండోరా పోరాటముద్రలు



● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1996నుంచి ఉద్యమాలు
● ఫలితం దక్కిందంటూ మాదిగల హర్షాతిరేకాలు

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెనుక దండోరా పేరుతో ఎమ్మార్పీఎస్ చేపట్టి సాగించిన సుదీర్ఘకాలపు పోరాటం ఉంది. ఈ ఉద్యమ సంఘటనలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అనేక ప్రాంతాలు వేదికలయ్యాయి. ఉద్యమ ఉధృతికి సాక్ష్యంగా నిలిచిన కొన్ని సందర్భాల సమాహారం ఇది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



●ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1996 నుంచీ ఎమ్మార్పీఎస్ ఉద్యమ కార్యాచరణ మొదలైంది. తొలి కార్యక్రమమే నాటి సీఎం చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లి నుంచీ హైదరాబాదుకు పాదయాత్ర వంటి భారీ కార్యక్రమం కాగా అందులో మంద కృష్ణ మాదిగ స్వయంగా పాల్గొన్నారు.

●2006లో మదనపల్లె నుంచీ ఛలో హైదరాబాదు కార్యక్రమానికి మదనపల్లె దిగువ కమ్మపల్లెకు చెందిన మనిగే రామయ్య రైల్లో వెళుతూ మహబూబ్‌నగర్ వద్ద జారిపడి చనిపోయారు.

●2007లో ఎమ్మార్పీఎస్ ఆందోళనకారులు మదనపల్లె సమీపంలోని అంగళ్లు వద్ద నాలుగు బస్సులు ధ్వంసం చేసి రెండింటిని తగులబెట్టారు. 32మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొని జైలుపాలయ్యారు. అదే ఏడాది పీలేరు రైల్వే స్టేషన్‌లో సిగ్నల్ రూమ్‌ను తగులబెట్టిన ఘటనలో ఎనిమిది మంది జైలుకు వెళ్ళారు. ఆ ఏడాదిలోనే కలకడ ఎంపీడీవో కార్యాలయాన్ని తగులబెట్టిన ఘటనలో ఆరుగురు క్రిమినల్ కేసులు ఎదుర్కొన్నారు.

● 2008లో అంగళ్లు బస్టాండులో ఆర్టీసీ బస్సును తగలబెట్టేశారు.చిత్తూరులోని టీడీపీ కార్యాలయాన్ని ముట్టడించారు.

● 2009లో కుప్పంలో రైలును అడ్డుకున్న ఘటనలో పోలీసు కేసులు ఎదుర్కొన్నారు. మదనపల్లెలో సెంట్రల్ సెరికల్చర్ కార్యాలయ ఆవరణలో జీపును కాల్చివేసిన ఘటనలో ఆరుగురు జైలుకు వెళ్ళారు. తిరుపతిలో జస్టిస్ ఉషా మెహ్రా పర్యటన సందర్భంగా వర్గీకరణ అనుకూల, వ్యతిరేక వర్గాల నడుమ ఘర్షణ జరిగింది.

● 2010లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ కాన్వాయ్‌ను తిరుపతి ఎన్టీయార్ కూడలి వద్ద అడ్డుకున్న ఘటనలో పోలీసులు జరిపిన లాఠీఛార్జీలో 20 మంది తీవ్ర గాయాలకు గురి కాగా 18 మంది జైలుపాలయ్యారు.

●2011లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా వున్నప్పుడు ఆయన నియోజకవర్గ కేంద్రమైన పీలేరు నుంచీ హైదరాబాదుకు మాదిగల తిరుగుబాటు రథయాత్ర జరిగింది.

● 2014లో రాయలసీమ జిల్లాల కన్వీనర్ నరేంద్రబాబు మాదిగ ఆధ్వర్యంలో ములకలచెరువు నుంచి సత్యవేడు వరకు పాదయాత్ర చేశారు. అప్పటి ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు దేవరాజులు మాదిగ ఆధ్వర్యంలో కుప్పం నుంచి తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ వరకు పాదయాత్ర చేశారు.

●గతేడాది ఏప్రిల్‌లో తిరుపతిలో జాతీయ మహాసభలు సైతం నిర్వహించారు.



మా పాత్ర సింధువులో బిందువు

పద్నాలుగేళ్ళ నుంచీ ఉద్యమంలో పనిచేస్తున్నా. కార్యకర్తగా చేరి ఇపుడు జిల్లా నేతగా ఎదిగా. లక్షల కుటుంబాలకు మేలు చేసే సముద్రమంతటి ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మేము పోషించిన పాత్ర చిన్న బిందువు లాంటిది. సుప్రీం కోర్టు తీర్పు మా పోరాటాన్ని అర్థవంతం చేసింది.

-పులికుంట్ల గోపి, తిరుపతి

పాతికేళ్ళ పోరాటం సార్థకమైంది!



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ నాయకత్వంలో పాతికేళ్ళపాటు సాగించిన మా పోరాటం సుప్రీం కోర్టు తీర్పుతో సార్థకమైంది. చదువును, ఉద్యోగాన్ని, కుటుంబాన్ని కూడా వదిలిపెట్టి ఉద్యమం కోసం పనిచేసినందుకు ఫలితం దక్కింది.నాలాగే ఎంతోమంది నాయకులు చేసిన త్యాగాల పునాదుల మీద మాదిగ ఉప కులాలకు చెందిన లక్షల కుటుంబాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కలగనుండడం పట్ల గర్వంగా వుంది.

- ఎస్.నరేంద్రబాబు, మదనపల్లె



వర్గీకరణ ఉద్యమాన్ని ఉరకలెత్తించిన నేతలు

ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం తొలినాళ్ళలో జిల్లావ్యాప్తంగా పలుచోట్ల చురుగ్గా సాగింది. ప్రారంభంలో తొలినాళ్ళలో చిత్తూరు బ్యాంకు ఉద్యోగి గిరిధర్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. తరచూ కార్యక్రమాల్లో పాల్గొంటూ విధులకు హాజరు కాలేక చివరికి ఉద్యోగం కూడా పోగొట్టుకున్నారు. తర్వాతి దశలో ఉద్యమానికి మదనపల్లె బలమైన కేంద్రంగా మారింది. ఆ ప్రాంతానికి చెందిన నేత పీటీఎం శివప్రసాద్ ఉద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించారు. జిల్లాలో జరిగిన మిలిటెన్సీ తరహా ఘటనలన్నింటికీ ఆయనే నాయకత్వం వహించారు. ఆ క్రమంలో పలు క్రిమినల్ కేసులను ఎదుర్కొని జైలుపాలయ్యారు.ఈ రెండవ దశలో మదనపల్లెలో టీచర్ మోహూరి కృష్ణప్ప, పాలిటెక్నిక్ విద్యార్థి చలవాది శ్రీనివాసులు, మలారి గిరిబాబు, పీటీఎంలో కేవీ రమణ, పుంగనూరులో మిద్దింటి వెంకటస్వామి, చిత్తూరులో ప్రభుత్వ ఉద్యోగి చెంగయ్య, పాకాలకు చెందిన బాబు, సుగుణమ్మ దంపతులు, కేవీపల్లెలో ముల్లంగి చంద్రయ్య, తంబళ్ళపల్లెలో పాతకోట సుబ్బన్న, తిరుపతిలో గోపీ తదితరులు నాయకత్వం చేపట్టి చురుగ్గా పనిచేశారు. మూడవ దశలో మదనపల్లెలో నరేంద్రబాబు, మంచూరు మారెప్ప, పీలేరులో గండికోట వెంకటేష్, తిరుపతిలో ఒద్దెపోగు రవి, వైకే విశ్వనాథ్, టీటీడీ ఉద్యోగి వెంకటరత్నం, ఎర్రావారిపాలెంలో నడిమికండ్రిగ సుధాకర్, కుప్పంలో దేవరాజు తదితరులు నాయకత్వం వహించి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు.

మా పోరాటం ఫలితాన్నివ్వడం హర్షదాయకం



కేవీబీపురం మండలం కాళంగి గ్రామం నుంచీ 2011లో ఉద్యమంలో చేరా. సమాజం అంటే ఏమిటో తెలియని మా కులానికి ఎమ్మార్పీఎస్ ఉద్యమం సమాజం పట్ల అవగాహన కలిగించింది. సమస్యల కోసం పోరాడే ధైర్యాన్ని, చైతన్యాన్ని రగిలించింది. మా పోరాటం ఫలితాన్ని సాధించడం దానివల్ల లక్షల కుటుంబాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో లబ్ధి కలగనుండడం సంతోషాన్నిస్తోంది.

- సూరిపాక వాసుదేవరావు, కాళంగి

మాదిగలకు నిజమైన స్వతంత్రం



30 ఏళ్ల కల సాకారమైంది. దేశానికి స్వతంత్రం ఎప్పుడో వచ్చినా, మాదిగలకు మాత్రం సుప్రీంకోర్టు తీర్పుతో నిజమైన స్వతంత్రం ఇప్పుడు వచ్చింది.

- దేవరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్
ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు

ఏంటిది గోవిందా?

● విష్ణునివాసంలోని ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో క్యూలైన్ల ఏర్పాటు
● రోడ్లపై బారులు తీరుతున్న వాహనాలు
● తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు

తిరుపతిలోని విష్ణునివాసం ఆవరణలోని ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో క్యూలైన్ల ఏర్పాటుతో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేక బస్సులను వెలుపల సర్వీసు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలతోపాటు బస్సులు కలుస్తున్న కారణంగా రెండు వరుసలుగా పార్కింగ్ విస్తరిస్తోంది. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనివల్ల ట్రాఫిక్ పోలీసుల నుంచి అభ్యంతరం ఎదురవుతుండటంతో డ్రైవర్లు ఒత్తిడికి గురవుతున్నారు.

టీటీడీతో కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం విష్ణునివాసం ఆవరణంలోని ఖాళీ స్థలంలో ఆర్టీసీ బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. దాదాపు 10 బస్సులు వరుసక్రమంలో ఉంటాయి. రైల్వేస్టేషన్ ముందు స్థలం ఖాళీ అవగానే ఇక్కడినుంచి బస్సులు ఒకదాని వెంట ఒకటి ముందుకు కదులుతాయి. ఇలా ప్రతి బస్సుకు దాదాపు అరగంట సమయం పడుతుంది. ఆ సమయంలో డ్రైవర్లు కాసింత విశ్రాంతి తీసుకుంటారు. దాంతో తిరుమల ఘాట్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా బస్సులు నడుపుతూ భక్తులకు సురక్షిత ప్రయాణం అందిస్తుంటారు. ఈ వెసులుబాటుకు మే నెల ఒకటో తేదీన బ్రేక్ పడింది.


విష్ణునివాసం ఆవరణంలో పూర్తిగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

మూడు నెలలుగా వాయిదా..

విష్ణునివాసంలో శ్రీవారి సర్వదర్శనానికి టైమ్‌స్లాట్ టోకెన్లు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. మే నెల నుంచి రద్దీ పుంజుకుంటుందని టీటీడీ భద్రతా విభాగం ముందు జాగ్రత్త చర్యగా ఆర్టీసీకి లేఖ రాసింది. రద్దీని క్రమబద్ధీకరించడానికి పార్కింగ్ స్థలాన్ని క్యూలైన్లు ఏర్పాటుకు అప్పగించాలని కోరింది. ఆ వెంటనే స్వాధీనం చేసుకుంది. నెల తర్వాత అప్పగిస్తామని చెప్పినా అది జరగలేదు. జూన్‌లోనూ కొనసాగింది. జూలైలో వారాంతంలోనూ రద్దీ ఉంటుందని, తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేంతవరకు ఆ క్యూలైన్లు తొలగించమని ఖరాకండిగా చెప్పేసింది. ఇలా పార్కింగ్ స్థలం అప్పగింత విషయం వాయిదా పడుతుండడం ఆర్టీసీ యంత్రాంగాన్ని కలవరపెడుతోంది.

పరిష్కారంపై దృష్టి పెట్టకనే..

ఇక్కడున్న ఖాళీ స్థలాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేసుకుంటే.. మిగిలిన స్థలంలో ఆర్టీసీ బస్సులు పార్కింగ్ చేసుకునే అవకాశముంది. దీంతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అలా చేయకుండా భద్రతా విభాగం తమకు సులువైన మార్గంపైనే ఆధారపడుతోందన్న విమర్శలున్నాయి. అదీగాక అర్ధరాత్రి రెండు గంటలకు టోకెన్ల జారీ ప్రారంభమై ఉదయం ఆరు గంటలకు దాదాపు పూర్తవుతుంది. అప్పటికే వెలుపల ఉన్న భక్తులు విష్ణునివాసం లోపలికి చేరుకుంటారు. ఈ క్రమంలో ఉదయం ఐదు గంటల నుంచే క్యూలైన్లు ఖాళీ అవుతాయి. అంటే ఓ నాలుగు గంటల పాటు రద్దీని క్రమబద్ధీకరించడం బదులుగా స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడంతోనే సమస్య తలెత్తుతోంది. టీటీడీకి దీటుగానే ఆర్టీసీ కూడా భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ఇకనైనా టీటీడీ ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

- తిరుపతి (ఆర్టీసీ)



తూర్పు భాగంలో స్థలమున్నా ఒకే క్యూలైను ఏర్పాటు చేశారిలా...

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు లభించింది. బుధవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ గురువారం లెక్కించింది. ఈమేరకు రూ.3.66 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ శుక్రవారం ప్రకటించింది. ఇక, గురువారం 61,465 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 21,206 మంది తలనీలాలు సమర్పించారు.



వెంకన్న సేవలో హీరో అల్లు శిరీష్

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు శిరీష్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఈమేరకు ఆలయ సిబ్బంది అల్లు శిరీష్‌కు ప్రసాదాలు అందజేశారు.

తిరుచ్చిపై పద్మావతి దేవి అభయం


మాడవీధుల్లో ఊరేగుతున్న పద్మావతిదేవి

తిరుచానూరు, ఆగస్టు 2: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వేకువజామున అర్చకులు అమ్మవారి మూలమూర్తికి నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీ పూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతిదేవికి తిరువీధి ఉత్సవం వేడుకగా జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీఈవో గోవిందరాజన్, ఏఈవో రమేశ్, సూపరింటెండెంట్ మధు, చంద్రశేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ


అంబేడ్కర్ విగ్రహం ముందు హర్షం వ్యక్తంచేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చంద్రగిరి, ఆగస్టు 2: ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టులో చట్టబద్ధత లభించిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు వెంకటపతి మాదిగ అన్నారు. శుక్రవారం చంద్రగిరిలోని టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి, స్వీట్లు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం చేసారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పోట్లూరి రామారావు, సంగీతం రామ్మూర్తి, కొడిదల రామ్మూర్తి, కృష్ణయ్య, చెంగల్రాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై విజయోత్సవ ర్యాలీ

ఎర్రావారిపాలెం, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందని నాయకుడు పల్లి పాక నాగరాజ అన్నారు. మండల కేంద్రంలో డప్పు వాయిద్యాలతో ర్యాలీ జరిపారు. అనంతరం అంబేడ్కర్, మందకృష్ణ మాదిగల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అంజనేయలు, హరి, శేఖర్, జయేంద్ర, వంశి, రాజన్న, గిరి, సిద్ధయ్య, మోహన్‌గాంధీ, గిరిబాబు, గణేష్, శివ, రెడ్డెప్ప, రాజమోహన్ పాల్గొన్నారు.

ఈ-పంటని నమోదు చేసుకోండి

● వ్యవసాయ అధికారి ప్రసాదరావు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు

తిరుపతిరూరల్, ఆగస్టు2: రైతులందరూ ఈ-పంటని నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లె రైతుసేవా కేంద్రం పరిధిలోని రైతులకు ఈ-పంట నమోదుపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు అవశ్యకత, దాన్ని వల్ల ఉపయోగాలను వివరించారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలుదారు సర్టిఫికెట్ తీసుకోవాలని, ల్యాండ్ ఓనర్‌తోపాటు కౌలు రైతుకి కూడా అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని తెలిపారు. కౌలు సర్టిఫికెట్ ద్వారా బ్యాంకు రుణాలు కూడా అందిస్తారని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడీఏ మనోహర్, ఏవో మమత, హరిత రైతు సేవాకేంద్రం ఇన్‌చార్జి ప్రేమలత, రైతులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహిద్దాం

- ఎమ్మెల్యే పులివర్తి నాని -


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, ఆగస్టు 2: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ, శత చండీ సహిత, సహస్ర కలశ కుంభాభిషేక మహోత్సవాని ఘనంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు అమ్మవారి ఆలయ కుంభాభిషేకం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే ఆలయ నూతన కమిటీ సభ్యులు, మాజీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు, స్థానిక నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంభాభిషేక మహోత్సవ సమయంలో చేపట్టవలసిన వివిధ పనులను వివరిస్తూ, దిశానిర్దేశం చేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం పెద్దఎత్తున ఎంతోమంది విరాళాలు అందించారని, వారందరికీ కూడా ఆహ్వానాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రగిరిలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలంకరణకు, క్యూ లైన్లు ఏర్పాటుకు, శాంతి భద్రతల పరిరక్షణకు, తాగునీటి సౌకర్యం కల్పనకు ఆయా శాఖాధికారులు కృషి చేయాలని సూచించారు.

ఉద్యానవన పంటలపై రైతులు దృష్టి సారించండి


భీమవరంలో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉద్యాన అధికారి

చంద్రగిరి, ఆగస్టు 2: రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి అన్నారు. చంద్రగిరి మండలం ఐతేపల్లి, భీమవరం గ్రామాల్లోని శ్రీలక్ష్మీకృష్ణ ఉద్యాన ఉత్పత్తిదారుల రైతు సంఘానికి చెందిన కలెక్షన్ సెంటర్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ మామిడి పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. కొమ్మ కత్తిరింపుల అనంతరం లోతుగా దుక్కులు చేసుకుని 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు వంద కేజీలు పశువుల ఎరువు, 5 కేజీలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 2 కేజీలు యూరియా, 1.5 కేజీ పొటాష్ ఎరువులను వేసుకుని మట్టితో మూసి నీరు పెట్టాలని తెలిపారు. 10 ఏళ్లలోపు వయసుగల మామిడి తోటలలో జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను ఎకరాకు 10 నుంచి 15 కేజీలు చల్లుకుని పూత వచ్చే ముందు దశలో పొలంలో దున్నుకోవాలని, ఈ విధంగా చేయడం వలన భూమిలో కర్బన శాతం పెరగడమే కాకుండా మొక్కకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్. శైలజ, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాతుకుపోయారు!

● ఏళ్లకు ఏళ్లు గడుస్తున్నా ఒకే సీటులోనే కొందరు అధికారుల తిష్ఠ

● చేయి తడపనిదే పనికావడం లేదంటున్న రోగులు ● రుయాస్పత్రిలో ఇదీ పరిస్థితి


సదరం కార్యాలయం ముందు నిరీక్షిస్తున్న రోగులు (ఫైల్ ఫొటో)

తిరుపతి(వైద్యం), ఆగస్టు2: సాధారణంగా ఏ శాఖలోనైనా అందులో విభాగాల వారీగా పనిచేసే అధికారులను కనీసం ఐదేళ్లకు ఒకసారి మరో విభాగానికి మార్చాలనే నిబంధనలు ఉన్నాయి. ఆర్థిక వ్యవహారాల విభాగాలైతే మూడేళ్లకు ఒకసారి కూడా మారుస్తారు. కానీ రుయాస్పత్రిలోని పరిపాలనా విభాగంలో పదేళ్లకుపైగా కొందరు ఒకే సీటులో తిష్ఠ వేసి ఉన్నారు. ఇంకొందరు ఏకంగా 20 ఏళ్లకుపైగా ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన విభాగాల్లోనూ ఉన్నారు.

కొత్త ప్రభుత్వాలు, కొత్త అధికారులు వచ్చిన సమయంలో ఇలా పాతుకుపోయిన వారంతా ముడుపులు చెల్లించడమే దీనివెనుకున్న కారణమన్న ఆరోపణలున్నాయి. అంటే వీరికెంత లబ్ధి చేకూరుతుందో అర్థం చేసుకోవచ్చు.

కొన్ని విభాగాలను పరిశీలిస్తే..

● ఆస్పత్రికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపు, ఖర్చులు చూసే విభాగంలో ఓ అధికారి ఏకంగా 25 ఏళ్లకుపైగా ఒకే సీట్లో ఉన్నారు. ఈ అధికారికి పలుమార్లు పదోన్నతి వచ్చినా తిరస్కరించి మరీ అదే సీట్లో కొనసాగడం విశేషం. ఈ సీటు కోసం మరో విభాగానికి చెందిన అధికారి ఒకరు ఇటీవల రూ.50 లక్షల వరకు ఉన్నతాధికారులకు ఇవ్వడానికి ముందుకు వచ్చాడన్న ప్రచారం జరిగింది.

● అకౌంట్స్, స్టేషనరీ, మందుల కొనుగోళ్ల వంటి విభాగాలతోపాటు స్టోర్ సెక్షన్లలో ఉన్న అధికారులు సైతం ఒక్కొక్కరు పదేళ్లకుపైగా ఒకే సీట్లో ఉన్నారు. ఈ విభాగాల్లో నెలకు రూ.20-30 లక్షలకుపైగా ఆర్థిక లావాదేవీలు జరుగుతుంటాయి. ఇందులో భారీస్థాయిలో నిధులు పక్కదోవ పడుతున్నాయనే ఆరోపణలున్నాయి.

● సదరం విభాగంలో నెలకు 60-80 శాతం వరకు శారీరక, మానసిక వికలాంగులకు మెడికల్ బోర్డు తరఫున వారి అంగవైకల్యం నిర్ధారిస్తూ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. ఇక్కడ 40 శాతానికి మించి ధ్రువీకరణ పత్రం కావాలంటే వారు అడిగినంత ఇచ్చుకోవాలి. దీనికితోడు నెలలో సుమారు పదికిపైగా మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5లక్షలకుపైగా తీసుకుంటారనే ఆరోపణలున్నాయి. వీటిపై పలుమార్లు ఉన్నతాధికారులకు బాధితులు ఫిర్యాదులు కూడా చేసి ఉన్నారు.

● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన రోగుల మరణ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మెడికల్ రికార్డు సెక్షన్‌కు వెళ్లాలి. ఇక్కడా ఐదేళ్లకుపైగా ఒకే అధికారి ఉండటంతో చేయి తడపనిదే పనిచేయడం లేదన్న ఆరోపణలున్నాయి. రోగి మరణించిన నెలలోపు డెత్ సర్టిఫికెట్ కోసం సంబంధీకులు వస్తే రూ.500.. ఆపై ఆలస్యమైతే అందుకు తగిన రీతిలోనే ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. వివరాలను సరిదిద్దుకోవాలన్నా భారీగానే మూల్యం చెల్లించాలి. ఈ విషయాలపై గత నెలలో కొందరు బాధితులు సూపరింటెండెంట్‌కు కూడా ఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి.

హోమం భక్తులనూ సుపథం నుంచి అనుమతించండి

● డయల్ యువర్ టీటీడీ ఈవోలో భక్తుల విన్నపం

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): 'అలిపిరిలో శ్రీనివాస దివ్యానుగ్రహం హోమం చేసుకునే భక్తులను కూడా సుపథం నుంచి దర్శనానికి అనుమతించండి' అంటూ మునిలక్ష్మి(నెల్లూరు), భాస్కర్(కడప) తిరుమలలో శుక్రవారం ఉదయం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో శ్యామలరావుకు దృష్టికి తీసుకువచ్చారు. 'గతంలో లడ్డూ నాణ్యత చాలా అద్భుతంగా ఉండేది. నోట్లో వేసుకుంటే అమృతంలా కరిగిపోయేది. తర్వాత తగ్గిపోయింది. మీరు వచ్చాకా మార్పులు చేస్తున్నారు. తిరుమలకు గ్రహణం వీడినట్టు అనిపిస్తోంది' అని మచిలీపట్నానికి చెందిన పూర్ణచంద్రశేఖర్ అన్నారు. తిరుమలలోని వసతి గదుల్లో ఎలుకలున్నాయి. మా ప్రసాదాలను తినేయడం వల్ల తీసుకురాలేకపోయాము' అని లక్షణ్(చిలకలూరిపేట) ఫిర్యాదు చేశారు. వీటిపై ఈవో స్పందిస్తూ.. లడ్డూల నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎలుకలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక, హోమం భక్తులను సుపథం ఎంట్రీపై పరిశీలన చేస్తామన్నారు. మొత్తం 33 మంది భక్తులు ఫోన్ చేసి ఈవోతో మాట్లాడారు. ప్రధానంగా.. ఆలయంలో తోపులాటలు అధికంగా ఉన్నాయని వెంకటేశ్వర్లు (హైదరాబాద్) తెలుపగా, నివారణకోసం విజిలెన్స్, అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటారన్నారు. టీటీడీ కల్యాణమండపాలు లీజుకు తీసుకుని రూ.6 లక్షలు ఖర్చుతో ఆధునీకరించామని, తమ పరిస్థితి ఏంటని శ్రీనివాస్(తెలంగాణ) ప్రశ్నించగా, లీజు పాలసీని పరిశీలిస్తున్నామని, అధికారులు మీతో మాట్లాడతారన్నారు. తిరుపతిలోని కోదండరామ స్వామి ఆలయంలో మూలమూర్తుల పాదాల వద్ద హనుమంతి విగ్రహం లేదని శేఖర్ ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. తొమ్మిదినెలల క్రితం టీటీడీలో ఏఈఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇంతవరకు రాత పరీక్ష నిర్వహించలేదని దేవానంద్ ఈవో దృష్టికి తీసుకురాగా, త్వరలో నియామకాలు పూర్తి చేస్తామన్నారు. దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరించాలని రాజేష్ కోరగా, సాధ్యం కాదని స్పష్టం చేశారు. తిరుత్తణిలో టీటీడీ స్థలం ఆక్రమణలకు లోనవుతుందని నాగరాజన్(నగిరి) తెలుపగా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీ పుస్తక విక్రయశాలల్లో టీటీడీ ప్రచురణలు అందుబాటులో ఉంచాలని అలేఖ్య కోరగా, చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చారు. అన్నప్రసాదాలు, పాలు నిరంతరాయంగా అందిస్తున్నారని చాలా మంది భక్తులు అభినందించారు.

ఎస్ఎస్‌డీ భక్తులు కేటాయించిన సమయానికే రావాలి

టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): క్యూలైన్‌లో వేచిఉండే అవసరం లేకుండా ఎస్ఈడీ(రూ.300 ప్రత్యేక దర్శనం) టికెట్లు, ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్లపై కేటాయించిన సమయానికే దర్శనానికి రావాలని టీటీడీ ఈవో శ్యామలరావు భక్తులకు విజ్ఞప్తి చేశారు. చాలామంది భక్తులు కేటాయించిన సమయానికంటే ముందుకు దర్శనానికి రావడంతో చాలా సమయం వేచిఉండాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. భక్తుల సమాచారం కోసం ఇప్పటికే తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రకటనలు చేస్తున్నామన్నారు. శుక్రవారంనుంచి తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్, శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద కూడా ప్రకటనలు ప్రారంభిస్తామన్నారు. భక్తులు వేచి ఉండకుండా తిరుపతిలోని స్థానిక ఆలయాల సందర్శన లేదా తిరుమలలోని ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించవచ్చని సూచించారు.


సౌకర్యాలపై భక్తులతో ఆరా తీస్తున్న ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమలలో ఈవో, అదనపు ఈవో తనిఖీలు

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. జేఈవో గౌతమితో కలిసి టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మొదట అన్నమయ్య భవనంలో ఏపీటీడీసీ నడుపుతున్న హోటల్‌లో వినియోగిస్తున్న ముడిసరుకులను తనిఖీ చేశారు. తర్వాత పీఏసీ2, మాధవనిలయాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న పీఏసీ5ను పరిశీలించి అధికసంఖ్యలో భక్తులు ఉండేలా నిర్మాణ పనులు నిర్దీత గడువులోగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్వీ మ్యూజియంను ఆధునీకరిస్తున్న టీసీఎస్ బృందంతో కలిసి పనుల పురోగతిని పర్యవేక్షించారు. అనంతరం పాంచజన్యం వసతి గృహం వద్దనున్న నూతన వంటశాల, బయట ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వైకుంఠం కంపార్టుమెంట్లు, అక్షయ కిచెన్‌ను పరిశీలించారు. కంపార్టుమెంట్లలో అన్నప్రసాదాలు ఎలా అందుతున్నాయి, సమయానికి పాలు ఇస్తున్నారా లేదా అని భక్తులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి ఎంత సమయం పడుతుందనే సమాచారాన్ని కంపార్టుమెంట్ల ముందు రాస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డీఈ రవిశంకర్‌రెడ్డి, మ్యూజియం ఇన్‌చార్జి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఏదో అనుకుంటే.. ఇంకేదో అయ్యిందే!

● కోరిన స్థానం లభించక సర్దుబాట్లలో తహసీల్దార్లు ● మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ

● ఏడుగురు డీటీలకు తహసీల్దార్లుగా పూర్తి అదనపు బాధ్యతలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: చిత్తూరు జిల్లాలో 30 మంది తహసీల్దార్లను సర్దుబాటు చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు వెళ్లి తిరిగొచ్చిన తహసీల్దార్లు తమకు అనుకూలమైన మండలాల్లో పోస్టింగ్స్ కోసం.. తెలిసిన అధికార కూటమి నాయకుల ద్వారా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి సిఫార్సులేఖలు తెచ్చుకుని కలెక్టరేట్‌లో సమర్పించారు. తాను కోరుకున్న, బాగా రాబడి వస్తుందనుకున్న మండలాల్లో పోస్టింగ్స్ వస్తుందని ధీమాగా ఉన్న కొందరు తహసీల్దార్లను సీసీఎల్ఏ జారీచేసిన మార్గదర్శకాలు ఇబ్బందుల్లో నెట్టేసింది. కలెక్టర్ జారీచేసిన జాబితాల్లో తాము కోరుకున్న మండలాలు లేకపోవడంతో ఏదో అనుకుంటే... ఇంకేదో అయ్యిందే అన్నట్లు దిగాలు పడ్డారు. గతంలో పనిచేసిన మండలాల్లో, సొంత డివిజన్‌లో తహసీల్దార్లకు మళ్లీ పోస్టింగ్ ఇవ్వకూడదని సీసీఎల్ఏ పేర్కొంది. తహసీల్దార్ల సర్దుబాటు జాబితా తయారీలో సీసీఎల్ఏ మార్గదర్శకాలు ఉల్లంఘించారంటూ కొందరు తహసీల్దార్లు ఆరాతీస్తున్నారు.

ఏడుగురు డీటీలకు..

ఏడుగురు డిప్యూటీ తహసీల్దార్లకు.. తహసీల్దార్లుగా ఫుల్ అడిషినల్ ఛార్జ్ (ఎఫ్ఏసీ) ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. గంగవరం డీటీ ఎం.ఎస్.ప్రసన్నకుమార్ పెద్దపంజాణికి, ఐరాల డీటీ ఎన్.సుధాకర్ తవణంపల్లెకి, గుడిపాల డీటీ బి.కళ్యాణి పెనుమూరుకు, చిత్తూరు అర్బన్ డీటీ ఎస్.కిరణ్ విజయపురానికి, పెనుమూరు డీటీ కె.మహేష్‌కుమార్ ఐరాలకు, చిత్తూరు డీఎస్వో కార్యాలయ డీటీ జి.ఎల్.శివకుమార్ గంగవరానికి, వెదురుకుప్పం ఆర్ఎస్ డీటీ ఆర్.జయంత్ యాదమరికి తహసీల్దార్లుగా (ఎఫ్ఏసీ) నియమితులయ్యారు. కాగా కొందరు డిప్యూటీ తహసీల్దార్లను ఇతర జిల్లాలకు వ్యక్తిగత వినతులపై బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. పెద్దపంజాణి డీటీ ఎ.ఫణికుమార్ అన్నమయ్య జిల్లాకు, అన్నమయ్య జిల్లా డీఎస్వో కార్యాలయ డీటీ ఆర్.జయసింహ చిత్తూరు జిల్లా పులిచెర్ల తహసీల్దార్‌గా, తిరుపతి జిల్లా డీఎస్వో కార్యాలయ డీటీ కె.రమేష్ బాబు చిత్తూరు జిల్లా వెదురుకుప్పం తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా తహసీల్దార్‌గా పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణను తిరుపతి జిల్లాకు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

30 మంది తహసీల్దార్లకు పోస్టింగ్స్

జిల్లాలో 30మంది తహసీల్దార్లకు పోస్టింగ్స్ కల్పిస్తూ జారీ అయిన జాబితా వివరాలు ఇలా ఉన్నాయి. టి. సీతారాం- కలెక్టరేట్ ఏవో, కె.బ్యూలా- కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్, కె.పద్మజ- కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్, పి. మురళి- కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్,జి.ఎం. కుమారస్వామి- కలెక్టరేట్ ల్యాండ్ అక్విజైషన్ సెక్షన్, ఆర్.వాసుదేవన్- కలెక్టరేట్ ల్యాండ్ రిఫార్మ్స్, ఎన్.ఎస్.కృష్ణకుమార్- చిత్తూరు ఆర్డీవో ఆఫీసు ఏవో, టి.జి.మోహనవల్లి- పలమనేరు ఆర్డీవో ఆఫీసు ఏవో, పి.శివరాం- నగరి ఆర్డీవో ఆఫీసు ఏవో, జి.జయప్రకాష్- కుప్పం ఆర్డీవో ఆఫీసు ఏవో, ఎ.కళావతి- చిత్తూరు అర్బన్, కె.బెన్నురాజ్-సోమల, బి.హనుమంతు- చౌడేపల్లె, జి.చంద్రశేఖర్ రెడ్డి- గుడిపాల, బి. కులశేఖర్- సదుం,డి.రవికుమార్-నగరి, ఇ.శేషగిరిరావు- నింద్ర, ఎం.భగవతి- కార్వేటినగరం, వి.చంద్రశేఖర్- గంగాధరనెల్లూరు, ఇ.అమర్‌నాథ్-శ్రీరంగరాజపురం, ఎం.అరుణకుమారి- పాలసముద్రం, ఎన్.ఎం.గుర్రప్ప- పూతలపట్టు, కె.బాబు రాజేంద్రప్రసాద్- బంగారుపాళ్యం,ఆర్.ఇన్బనాథన్ -పలమనేరు,బి.పార్వతి-వి.కోట, ఎస్. మాధవరాజు- విజయపురం, వై.చిట్టిబాబు- కుప్పం, కె.అమర్‌నాథ్- శాంతిపురం, కె.బాబు- రామకుప్పం, బి.రామాంజుల నాయక్ - గుడుపల్లె.



ఎప్పటికీ రుణపడి ఉంటా : ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం, ఆగస్టు 2: తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన వారి ఆదరాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నాని గెలుపొందడటంతో ఎన్ఆర్ కమ్మపల్లి గ్రామస్తులు శుక్రవారం మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్లుపెట్టి విజయయాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తిమ్మరాజువల్లె వద్ద శాశ్వత ప్రాతిపదికన వంతెన ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సును పునరుద్ధరించి పశువైద్యశాలకు పక్కాభవనం నిర్మించి ఇస్తామన్నారు. రాయలచెరువు సప్లై చానెల్‌ను వెడల్పు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, జనార్ధన్ చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, సురేంద్రనాయుడు, గిరినాయుడు, మునెయ్య, జీవరత్నం, మాధవయ్య, సుబ్రహ్మణ్యంయాదవ్ పాల్గొన్నారు.

టీడీపీ నేత జన్మదిన వేడుకలు

టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి జన్మదిన వేడుకలు ఆయన స్వగ్రామం రాయలచెరువుపేటలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని కార్యక్రమానికి హాజరై పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, జనార్ధన్‌చౌదరి, హరిప్రసాద్, నరసింహారెడ్డి, జగదీష్, మాధవయ్య, లీగల్‌సెల్ అధ్యక్షుడు న్యాయవాది మునెయ్య పాల్గొన్నారు.

ఆర్‌సీపురంలో వర్షం

రామచంద్రాపురం, ఆగస్టు2: ఆర్‌సీపురం మండలంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో గంటపాటు ప్రయాణికులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. గంగిరెడ్డిపల్లె, కేకేవీపురం వద్ద ఇటుక తడచిపోయింది.

భవాని అమ్మవారికి తిరుమంజనం

రామచంద్రాపురం, ఆగస్టు 2: ఆషాడ శుక్రవారం సందర్భంగా రాయలచెరువుకట్ట జలకంఠేశ్వరాలయంలో వెలసిన భవానీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

నేటినుంచి తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు


సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: పేద, మధ్య తరగతి వర్గాలకోసం మరోసారి శనివారం నుంచి బియ్యం, కందిపప్పు ధరలను తగ్గించి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం నుంచి రైతుబజార్, రిలయన్స్, మోర్, జియోమార్ట్ వంటి సూపర్‌మార్కెట్, మాల్స్‌తో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా కిలో కందిపప్పు రూ.150, బియ్యం రూ.47, స్టీమ్డ్ బియ్యం రూ.48 చొప్పున వినియోగదారులందరికీ తక్కువ ధరలో అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. 1-15 తేదీల మధ్య ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నామని, బయోమెట్రిక్ పనిచేయని పక్షంలో ఐరిష్ లేదా వీఆర్వో ఆమోదంతో రేషన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎండీయూ ఆపరేటర్లకు ఇచ్చే నిత్యావసర వస్తువులను తూకం వేసి అందజేయాలన్నారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్డుదారులు ఆరోపించారు. సమావేశంలో డీఎస్వో శంకరన్, సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం మోహన్‌బాబు, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, డీవైఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో బాలిక మృతి


షర్మిల(ఫైల్ ఫొటో)

చిత్తూరు రూరల్, ఆగస్టు 2: నగరంలోని 1వ డివిజన్ కోలావూరుకు చెందిన కృష్ణమూర్తి, విమల కుమార్తె షర్మిల(11) డెంగ్యూతో శనివారం మృతి చెందింది. సంతపేటలోని బీసీ బాలికల హాస్టల్‌లో ఉంటూ పీఎన్‌సీ మున్సిపల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఆ బాలిక నాలుగు రోజుల క్రితం జ్వరంతో ఇంటికి వచ్చింది. సమీపంలోని ఆస్పత్రిలో చూపించగా రక్తపరీక్షల్లో డెంగ్యూ అని తేలింది. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి, తిరుపతికి రుయాకు రెఫర్ చేశారు. రుయాలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆడుతూపాడుతూ తిరిగిన కూతురు కళ్లముందు విగతజీవిగా కన్పించడం ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. ఆస్పత్రిలోనే బోరున ఏడ్చేశారు.

రూ.55లక్షల కర్ణాటక మద్యం ధ్వంసం



బంగారుపాళ్యం, ఆగస్టు 2: మండల పరిధిలో 2020 నుంచి స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని ఎస్ఈబీ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో శుక్రవారం ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.55 లక్షల విలువ చేసే 6,901 లీటర్ల మద్యం, 19 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. సీఐ లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లుల స్వీకరణకు బ్రేక్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అప్ లోడింగ్ జరుగుతున్న దృష్ట్యా గురువారం నుంచి సోమవారం వరకు సీఎఫ్ఎంఎస్ సర్వీసులు నిలిపివేసినట్లు ఆర్థికశాఖ తెలిపింది. ఈ కారణంగా ఖజానా శాఖకు చెందిన సబ్ ట్రెజరీ కార్యాలయాలు గురువారం నుంచి జీతాలు, కంటిన్జెంట్, సప్లిమెంటరీ, పాత ఇంక్రిమెంట్ తదితర బిల్లుల స్వీకరణ నిలిపివేసింది.

పదోన్నతి జాబితాపై అభ్యంతరాలు తెల్పండి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 2:చిత్తూరు, తిరుపతి నగరపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీల పదోన్నతి జాబితా ఎంఈవో మెయిల్స్ పంపామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని డీఈవో దేవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్ఏ (తెలుగు, హిందీ) పదోన్నతుల సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు ఉంటే 5వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలని తెలిపారు.



నగరంలో మోస్తరు వర్షం





తిరుపతి అర్బన్, ఆగస్టు 2: నగరంలో శుక్రవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. తొలుత హోరుగాలులు.. తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దాదాపు అరగంటపాటు కురిసింది. దీంతో రోడ్లపై వర్షపునీరు జోరుగా ప్రవహించింది. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. ఇక పగలంతా ఉక్కపోతకు గురైన ప్రజానీకం రాత్రి కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

ముగిసిన కోదండరాముడి పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 2: కోదండరామస్వామి ఆలయంలో రెండ్రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం సీతా, లక్ష్మణ సమేత రాముల వారికి సుప్రభాతం, తోమాల, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి, స్నపన తిరుమంజనం, వైదిక కార్యక్రమాలు పూర్తిచేశారు. సాయంత్రం సీతారామ లక్ష్మణులు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. భాష్యకార్ల గుడివద్ద శాత్తుమొర జరిగింది. తర్వాత యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ మూడ్రోజులూ టీటీడీకి చెందిన అన్నమయ్య ప్రాజెక్టు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు ఆలయంలో భక్తి సంగీత కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, కంకణభట్టార్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్, అర్చకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రేపు 'చాంబర్ ఆఫ్ కామర్స్' క్రీడా సంబరాలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 2: తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఏడు గంటలకు క్రీడలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మోహన్ రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవిలాలలోని ఓ ప్రైవేటు ఆటస్థలంలో ఈ క్రీడా సంబరాలను ఎస్పీ సుబ్బరాయుడు ప్రారంభిస్తారన్నారు. నిత్యం వ్యాపారాలతో బిజీగా ఉండే వ్యాపారులకు ఈ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి (జీవకోన), ఆగస్టు 2: సఫాయి కర్మచారి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ సఫాయి కర్మాచారి సంఘం జాతీయ అధ్యక్షుడు వీర్రాజు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. అంతకుముందు వీర్రాజును చిత్తూరు, తిరుపతి జిల్లా సంఘాల నాయకులు సన్మానించారు. ధనశేఖర్, చిన్నస్వామి, చిన్నమ్మ, చంద్రకళ, దాము, రాఘవులు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

తిరుపతి(విద్య), ఆగస్టు 2: తక్షణం స్పందించి తిరుచానూరు వీవీ నగర్ సమస్యను పరిష్కరించిన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వీవీ నగర్ కమిటీ సభ్యులు, బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ కమిటీ సభ్యులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. కాలనీ నీట మునిగిన విషయంపై ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై హర్షం తెలిపారు.

క్రికెట్ మైదానాన్ని త్వరగా పూర్తిచేయండి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 2: క్రికెట్ మైదానాన్ని త్వరగా పూర్తిచేసి.. క్రీడాభిమానులను అందుబాటులోకి తేవాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం గొల్లవానిగుంట వద్ద ఉన్న నిర్మాణంలోని క్రికెట్ మైదానం, నాలుగు ప్రాంతాల్లో పునఃప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్లు, కచ్చపి ఆడిటోరియం, ఇండోర్ స్టేడియంలను ఎస్ఈ మోహన్, ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అన్న క్యాంటీన్ల పనులు ఆదివారానికి పూర్తి చేయాలని ఆదేశించారు.

రేపు 'రామకృష్ణమఠం' వార్షికోత్సవం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 2: రామకృష్ణమఠం ఆశ్రమ తొమ్మిదో వార్షికోత్సవం ఆదివారం జరగనుందని కార్యదర్శి స్వామి సుకృతానంద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం ఎనిమిది గంటలకు ధ్యానంతో కార్యక్రమాలు మొదలవుతాయి. ఆధ్యాత్మిక అంశాలపై స్వామి సుకృతానంద (తిరుపతి, రామకృష్ణ మఠం) స్వామి శశికాంతానంద (రాజమహేంద్రవరం, రామకృష్ణ ఆశ్రమం), స్వామి శ్రీనివాసానంద (రామకృష్ణమఠం, కడప), స్వామి సత్వస్థానంద (రామకృష్ణ మఠం, తిరుపతి), ఆచార్య పి.వి. రెడ్డి, పి.భాస్కరరావు (రాణిపేట, తమిళనాడు) ప్రసంగిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు మాస్టర్ గోపి బృందం భజన ఉంటుంది.

ఘనంగా గాలి ధనుంజయనాయుడు జన్మదినం



తిరుపతి(విద్య), ఆగస్టు 2: బీజేపీ సీనియర్ నాయకుడు గాలి ధనుంజయ నాయుడు జన్మదినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన్ను సన్మానించి, కేక్ కట్‌చేసి వేడుకలు చేశారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, గాలి పుష్పలత, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, నరేష్ నాయుడు, సురేష్ స్వామి, ఆదిస్వామి, భూషణ్ రెడ్డి, జేజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీయూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన ముత్తువేల్‌ను సత్కరిస్తున్న హెల్త్ సెంటర్ ఉద్యోగి పవన్ గందోడి

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు ప్రారంభం

తిరుపతి(విద్య), ఆగస్టు 2: ఓపెన్ స్కూల్ విధానంలో 2024-25 సంవత్సరానికిగాను పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి.ఈనేపథ్యంలో ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను డీఈవో శేఖర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఆవిష్కరించారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



హోంగార్డు భార్యకు నియామక పత్రం అందచేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 2: తిరుపతిలో పని చేస్తూ విధి నిర్వహణలో మృతి చెందిన హోంగార్డు మోహన్ కుటుంబానికి ఎస్పీ సుబ్బరాయుడు బాసటగా నిలిచారు. మోహన్ భార్య కవితకు శుక్రవారం హోంగార్డు ఉద్యోగం ఇచ్చి ఆదుకున్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐకి నివాళి

తిరుపతిలో ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న రెడ్డి నాయక్ శుక్రవారం ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ.. నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయక్ కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీ రామకృష్ణమాచారి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు

ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడానికి కృషి చేద్దాం: కలెక్టర్



గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి(విద్య), ఆగస్టు 2: పేదలందరికీ ఇళ్లు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, దాన్ని నెరవేర్చేందుకు కృషి చేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. జేసీ శుభం బన్సల్‌తో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గృహ నిర్మాణశాఖ అధికారులతో సమావేశమయ్యారు. వంద రోజుల లక్ష్యాన్ని నిర్దేశించుకుని పురోగతి సాధించాలని ఆదేశించారు. ఇంకా నిర్మాణం ప్రారంభం కానివి, పునాది నుంచి గోడల స్థాయికి, గోడల స్థాయి నుంచి పైకప్పు స్థాయికి.. ఇలా 28,931 ఇళ్లు, పూర్తిస్థాయి రూఫ్ క్యాస్ట్ స్థాయికి 7687 స్టేజ్ కన్వర్షన్ పురోగతి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఈలు, డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి వారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తామని, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ పథక సంచాలకుడు వెంకటేశ్వర్‌రావు, ఈఈలు మోహన్‌రావు, శేషగిరి, డీఈలు శ్రీనివాసరావు, జహీర్, దాశయ్య, సత్యనారాయణ, షబ్బీర్, ఏఈలు పాల్గొన్నారు.

పవర్‌లైన్ టవర్ల షిఫ్టింగ్ పనులు 15లోపు పూర్తి చేయాలి

తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఏడు ఎలక్ట్రిక్ పవర్‌లైన్ టవర్ల షిఫ్టింగ్ పనులను ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం జేసీతో కలిసి తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, రహదారులు భవనాల శాఖ అధికారులతో కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. అధికారులు మాట్లాడుతూ.. నాలుగు టవర్లను 8వ తేదీలోపు, మిగిలిన వాటిని 15వ తేదీలోపు షిఫ్ట్ చేస్తామని కలెక్టర్‌కు చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్ట్ సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారులు, భవనాల శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జేసీతోపాటు కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి వేడుకల నిర్వహణపై సమీక్షించారు. ఎంఆర్‌పల్లెలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించడానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్టాల్స్ శకటాలను వివిధ శాఖలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలో పలు శాఖలు సాధించిన ప్రగతి నివేదిక, పీజీఆర్ఎస్‌ను సమాచార శాఖ పర్యవేక్షించాలని సూచించారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరుమారియమ్మకు ప్రత్యేక పూజలు



గాజుల అలంకారంలో అమ్మవారు



భక్తులకు అంబల్లు పోస్తున్న నరసింహయాదవ్, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి(కల్చరల్/జీవకోన), ఆగస్టు 2: తిలక్‌రోడ్డులోని సున్నపు వీధి ఎదురుగా ఉన్న కరుమారియమ్మ ఆలయంలో ఆడి నెల సందర్భంగా శుక్రవారం అమ్మవారు గాజుల అలంకారంలో కనువిందు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పొంగళ్లు పెట్టి, అంబళ్లు పోసి ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి, టీడీపీ నేత, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, మునిశేఖర్ రాయల్, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆలయ ధర్మకర్త జి.నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కాంచన, గుణశేఖర్ యాదవ్, మాధవ, లోకేష్, సాయి మహేష్, రఘు, గంగాధరం, వెంకటముని, అర్చకుడు వేలాయుదంస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌ను జాతీయ వైద్య సంస్థగా గుర్తించండి

తిరుపతిలో ఇన్నోవేటివ్ మెడికల్ హబ్‌ను ఏర్పాటు చేయండి

పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి

తిరుపతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ (శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ)ను జాతీయ ప్రాధాన్యం కలిగిన సంస్థ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్)గా గుర్తించాలని ఎంపీ గురుమూర్తి కోరారు. పార్లమెంట్‌లో శుక్రవారం హెల్త్ బడ్జెట్‌పై ఆయన ప్రసంగించారు. స్విమ్స్‌కు వచ్చే రోగుల్లో సుమారు 95 శాతం మంది సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యం గలవారేనన్నారు. స్విమ్స్ సహకారంతో తన పార్లమెంటు పరిధిలో ఫిబ్రవరి 2024లో రెండు మొబైల్ క్యాన్సర్ స్ర్కీనింగ్ యూనిట్లు ప్రారంభించామన్నారు. మహిళలకు క్యాన్సర్ స్ర్కీనింగ్, ఇమ్యునైజింగ్ కోసం మొబైల్ క్యాన్సర్ స్ర్కీనింగ్, ఇమ్యునైజింగ్ యూనిట్లను ప్రారంభించడానికి తగిన వనరులు కేటాయించాల్సిన అవసరం ఉందని ఎంపీ సభ దృష్టికి తీసుకొచ్చారు. శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీకి జాతీయ క్యాన్సర్ సంస్థగా గుర్తించాలని కోరారు. తిరుపతిలో స్వదేశీ వైద్య ఇంప్లాంట్లను అభివృద్ధి చేయడానికి ఇన్నోవేటివ్ మెడికల్ హబ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనివల్ల తక్కువ ఖర్చుతో వైద్య ఇంప్లాంట్స్ దొరుకుతాయన్నారు. మానసిక ఆరోగ్య రంగానికి రూ.90కోట్ల బడ్జెట్ కేటాయించారని, కోవిడ్ తర్వాత దేశ వ్యాప్తంగా మానసిక ఆరోగ్య సేవలకు పెరుగుతున్న డిమాండ్ తీర్చడానికి ఈ బడ్జెట్ కేటాయింపులు సరిపోవన్నారు. రాష్ట్రంలో మరిన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు.

గెస్ట్ టీచర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 2: జిల్లాలోని పది బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గెస్ట్ టీచర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి టి.పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి 2024-25 సంవత్సరానికిగాను పీజీలో 55 శాతం మార్కులతోపాటు బీఎడ్‌లో సంబంధిత మెథడాలజీ కలిగి టెట్‌లో అర్హత సాధించినవారు అర్హులన్నారు. ఈనెల 6వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు తిరుపతిలోని ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఏడో తేదీ ఉదయం 10 గంటల నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పుదూరులో డెమో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ ఆధారంగా ఎంపికలు ఉంటాయని పద్మజ వివరించారు.

సబ్జెక్టుల వారీగా ఖాళీలిలా..

స్త్రీలకు జేఎల్: మాథ్స్-1, కెమిస్ట్రీ-1, సివిక్స్-1, ఎకనమిక్స్-1, కామర్స్-1, టీజీటీ : హిందీ-1, ఇంగ్లిష్-1, మాథ్స్-1, సోషల్ స్టడీస్-1, పీఈటీ-1, హెల్త్ సూపర్‌వైజర్-1.

పురుషులు జేఎల్: మాథ్స్-1, పీజీటీ: మాథ్స్-1, ఫిజికల్ సైన్స్-1, హెల్త్ సూపర్‌వైజర్-1.

ఎస్వీయూ స్టోర్స్‌లో అక్రమాలపై విచారణ జరిపించండి: టీఎన్ఎస్ఎఫ్



రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2: ఎస్వీ యూనివర్సిటీ స్టోర్స్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ భూపతినాయుడిని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు తదితరులు కలిసి ఫిర్యాదు చేశారు. స్టోర్స్‌లో మూడేళ్లుగా బియ్యం, కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులు, కంప్యూటర్ స్టేషనరీ కొనుగోళ్లు, అమ్మకాల్లో భారీగా అక్రమాలు జరిగాయన్నారు. గ్యాస్ సిలిండర్లను కూడా అధిక ధరలకు హోటళ్లకు విక్రయించి కొందరు సొమ్ము చేసుకున్నారని చెప్పారు. విచారించి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తెలుగు యువత చంద్రగిరి ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, నర్సోజి, భీమేష్ రవి, గణేష్, రాజా, రామాజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పించండి

కలెక్టర్‌కు ఎన్ఎస్‌యూఐ నేతల వినతి

తిరుపతి(విద్య), ఆగస్టు 2: ప్రైవేటు పీజీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఎన్ఎస్‌యూఐ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున తదితరులు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు. జిల్లా కార్యదర్శి మన్సూర్, హేమాద్రి తదితరులున్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి: సీఐటీయూ



సమావేశంలో ప్రసంగిస్తున్న కందారపు మురళి

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 2: రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని మండిపడ్డారు. నూతన ప్రభుత్వం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేయడానికి కార్మికుల సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు కుమార్, ఆరోగ్యదాస్ ప్రసంగించారు.

విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసం

కేసు నమోదు

బాలాయపల్లి, ఆగస్టు 2: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని బాలాయపల్లికి చెందిన టి.వెంకట బంగారు ప్రసాద్ చౌదరి అలియాస్ బాబీ నడుపుతున్న కన్సల్టెన్సీని మండలానికి చెందిన 19 మంది సంప్రదించారు. న్యూజీలాండ్‌లో ఉద్యోగాలు ఉన్నట్టు తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావు పేటకు చెందిన జి.ప్రశాంత్, రవళి దంపతులు బాబీకి చెప్పారు. దీంతో బాబీ బాలాయపల్లెవాసుల నుంచి విడతల వారీగా రూ.48.38 లక్షలను వారికి పంపారు. వారు నకిలీ వీసాలు పంపడంతో మోసపోయినట్లు గ్రహించి బాలాయపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

500 నక్షత్ర తాబేళ్ల స్వాధీనం



మంగళం, ఆగస్టు 2: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లోని విజయవాడ పాయింట్ వద్ద శుక్రవారం రవాణాకు సిద్ధంగా వున్న 500 నక్షత్ర తాబేళ్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో తిరుపతి రేంజ్ ఎఫ్ఆర్వో సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎఫ్ఎస్వో రవీంద్ర, ఎఫ్‌బీవో సురేష్ బాబు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. విజయవాడ పాయింట్ వద్ద అనుమానాస్పదంగా కన్పించిన కొందరు వ్యక్తులను ప్రశ్నించే ప్రయత్నం చేయగా వారి వద్ద ఉన్న గోనె సంచులను వదిలి పారిపోయారు. ఆ సంచులను అధికారులు పరిశీలించి అందులో 500 నక్షత్ర తాబేళ్లున్నట్లు గుర్తించారు. పరారైన స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు తిరుపతి ఎఫ్ఆర్వో సుదర్శన్ రెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న నక్షత్ర తాబేళ్లను మామండూరు అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టినట్లు చెప్పారు.

ఈఏపీసెట్ ర్యాంకు కార్డు ఇంకా రాలేదు

విద్యా సంవత్సరం నష్టపోతానని విద్యార్థి ఆందోళన



పవన్ కల్యాణ్

ఏర్పేడు, ఆగస్టు 2: ఈఏపీసెట్‌లో ర్యాంకు సాధించి నప్పటికీ విద్యాశాఖ నుంచి కార్డు అందక ఏర్పేడు మండ లానికి ఓ విద్యార్థి ఆందోళన చెందుతున్నాడు. ఇసుక తాగేలి పంచాయతీ బీసీకాలనీ చెందిన మునిరెడ్డి, రాణి దంపతుల కుమారుడు పవన్ కల్యాణ్ శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 2024కు సంబంధించి ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీసెట్) రాసి 45,999వ ర్యాంకు సాధించాడు. అయితే ఇప్పటివరకు విద్యాశాఖ ర్యాంకు కార్డును పంపకపోవడంతో విద్యాసంవత్సరం నష్టపోతానని ఆందోళన చెందుతున్నాడు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి మెయిల్ పంపినా, ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో పరిశీలించగా నో రిజల్ట్ ఫౌండ్ అని చూపుతోందని చెబుతున్నాడు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకుని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చి తమ కుమారుడి భవిష్యత్తును కాపాడాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ట్రాఫిక్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



రామకృష్ణమాచారి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 2: తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీగా రామకృష్ణమాచారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో అలిపిరి, తిరుచానూరు, పలమనేరు, గంగవరం, ఆళ్లగడ్డ, ఒంటిమిట్ట, తిరుపతి పశ్చిమ, ఎస్‌బీ, తిరుమల సీఐగా పనిచేశారు. ఈ ఏడాది జనవరిలో డీఎస్పీగా పదోన్నతి పొందారు. తర్వాత నెల్లూరు దిశ స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేసి రెండ్రోజుల కిందట రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 96 మంది డీఎస్పీల బదిలీల్లో తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించాక ఆయన మాట్లాడుతూ.. తిరుపతికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.

దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉంది

- ఎస్సీ వర్గీకరణ తీర్పుపై కేంద్ర మాజీ మంత్రి చింతా వ్యాఖ్య



ఎస్సీ కార్పొరేషన్‌ను ప్రారంభించాలని ధర్నా చేస్తున్న మాజీ కేంద్రమంత్రి చింతామోహన్

చిత్తూరు, ఆగస్టు 2: రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా, దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఎస్సీ వర్గీకరణ తీర్పు ఉందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రానున్న పదేళ్లలో దేశాన్ని ప్రమాదంలో నెట్టేలా సుప్రీంకోర్టు తీర్పు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఏపీలో ఉన్న కోట్లాది మంది ఎస్సీల ఐక్యతను దెబ్బతీయడానికి రాజకీయ పార్టీలు పని చేశాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం పట్ల అవగాహన లేని ప్రధాని మోదీ దేశంలోని రెండు కులాల మధ్య చిచ్చుపెట్టేలా ఎస్సీ వర్గీకరణను తీసుకొచ్చారన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు.

ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం

రాష్ట్ర రజక జనసేవ సంఘం

తిరుపతి అర్బన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని రాష్ట్ర రజక జనసేవ సంఘం అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు. వర్గీకరణను దేశంలోనే మొదట అమలు చేసి.. సామాజిక న్యాయానికి నాంది పలికిన సీఎం చంద్రబాబును అభినందించారు. ఎస్సీలలో ఉపకులాలకు న్యాయం కోసం దశాబ్దాలపాటు అలుపెరుగని ఉద్యమం సాగించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ సేవలను కొనియాడారు. వర్గీకరణ ఉద్యమానికి ఉభయ రాష్ట్రాల్లో రజక సంఘాలు పూర్తిమద్దతు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పైగా ప్రధాని మోదీ మద్దతుతో ఉద్యమం ఉన్నత శిఖరాలకు చేర్చిందన్నారు. మద్దతు ఇచ్చిన వారందరికీ ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.

అంగన్‌వాడీ హెల్పర్‌పై దాడి

● ముగ్గురిపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 2: పట్టణంలోని జైహింద్‌కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో హెల్పర్‌గా పని చేస్తున్న కవితపై ముగ్గురు యువకులు దాడి చేశారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం మధ్యాహ్నం కవిత విధులు నిర్వహిస్తుండగా అదే కాలనీకి చెందిన మునీంద్ర, శంకర్, హరికృష్ణ మద్యం తాగి వచ్చి గెరిటతో దాడి చేశారు. దీంతో వారిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

కారు ఢీ కొని వృద్ధురాలి మృతి


దయమ్మ మృతదేహం

తడ, ఆగస్టు 1 : కారు ఢీ కొని వృద్ధురాలు మృతి చెందింది. మండల పరిధిలోని చేని గుంటకు చెందిన కె.దయమ్మ(62) శుక్రవారం ఉదయం అల్పాహారం తెచ్చుకునేందుకు దగ్గరలోని హోటల్‌కు రోడ్డు పక్కన నడిచి వెళ్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు రోడ్డు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలపాలై దుర్మరణం చెందింది. అక్కడే ఉన్న వారి సమాచారం మేరకు పోలీసులకు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించండి


సీఐతో మాట్లాడుతున్న దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 2: పోక్సో బాధితులకు అండగా నిలిచి నిందితుడికి కఠిన శిక్షలు అమలయ్యేలా కేసులు నమోదు చేస్తామని రూరల్ సీఐ జగన్ మోహన్‌రావు చెప్పారు. ఓజిలి మండలంలో బాలికపై అత్యాచారయత్నానికి సంబంధించి వృద్ధుడిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు సీఐను కలిశారు. నిందితుడికి కఠిన శిక్షలు అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి విమలమ్మ, ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షురాలు విజయనిర్మల, అధికార ప్రతినిధి సులోచనమ్మ, కార్యదర్శులు సుప్రియ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితుడి అరెస్టు

ఓజిలి, ఆగస్టు 2: బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఓజిలి ఎస్‌ఐ రవిబాబు తెలిపారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ కోసం నాయుడుపేట కోర్టుకు తరలించామన్నారు. నిందితుడ్ని విచారించిన కోర్టు రిమాండు విధించడంతో నెల్లూరు కారాగారానికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

24న గంధమహోత్సవం


కరపత్రాల ఆవిష్కరణలో దర్గా కమిటీ

గూడూరు అర్బన్, ఆగస్టు 2: పట్టణంలోని దర్గా వీధిలోని హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో ఈనెల 24న గంధమహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలి పారు. శుక్రవారం స్థానిక దర్గా ఆవరణలో మహోత్సవ కరపత్రాలను దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం ఉ ఉంటాయన్నారు. రియాజ్‌అహ్మద్, మగ్దూం, సందానీబాషా, షాన్‌వాజ్, గౌస్‌బాషా, షబ్బీర్, యస్థానీ, ఖలీఫా తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించండి

డక్కిలి/ వెంకటగిరి, ఆగస్టు 2: డక్కిలి మండలంలో కుష్ఠు, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. డక్కిలి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తుల వివరాలను వైద్యాధికారి బిందుప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. శరీరంపై పొడలు, మచ్చలు, పుండ్లు ఉన్న ప్రదేశంలో స్పర్శలేకుండా ఉంటే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. డీపీఎంవో రాజేంద్రప్రసాద్, వైద్యాధికారి శ్రీహరి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కుష్ఠు నివారణ అధికారి శ్రీనివాసులు రెడ్డి వెంకటగిరి పట్టణంలోని పాతకోట ఆరోగ్య కేంద్రంలో కుష్ఠువ్యాధి గ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. వైద్యులు రాజా, రమణ, కిరణ్, ప్రసాదరావులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పని సరి


మంగానెల్లూరులో ఈ పంట నమోదు

సూళ్లూరుపేట, ఆగస్టు 2: రైతులు సాగుచేసే పంటలకు తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకురాలు జి.అనిత చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని ఇలుపూరు, మంగానెల్లూరు గ్రామాల్లో పర్యటించి రైతులతో ఈ పంట నమోదుపై గ్రామ సభలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగు వివరాలతో పాటు సర్వే నెంబర్లు వ్యవసాయ అధికారుల ద్వారా ఈ పంట నమోదు చేసుకుంటునే పంటల బీమా పథకం, తక్కువ వడ్డీకే రుణాలు అందుతాయన్నారు. ఏవో కాంచన, గ్రామ వ్యవసాయ సహాయకుడు గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కోట మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో శుక్రవారం ఈక్రాప్‌పై రైతులకు అవగాహన జరిగింది.

పవర్‌లైన్ టవర్ల షిఫ్టింగ్ పనులు 15లోపు పూర్తి చేయాలి: కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 2: తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఏడు ఎలక్ట్రిక్ పవర్‌లైన్ టవర్ల షిఫ్టింగ్ పనులను ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, రహదారులు భవనాల శాఖ అధికారులతో కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. అధికారులు మాట్లాడుతూ... నాలుగు టవర్లను 8వ తేదీలోపు, మిగిలిన వాటిని 15వ తేదీలోపు షిఫ్ట్ చేస్తామని కలెక్టర్‌కు చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్ట్ సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారులు, భవనాల శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి: సీఐటీయూ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 2: రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని మండిపడ్డారు. నూతన ప్రభుత్వం కార్మికుల సమస్యలను వెంటనే పర్కిరించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేయడానికి కార్మికుల సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు కుమార్, ఆరోగ్యదాస్ ప్రసంగించారు.ఈ సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి వేడుకల నిర్వహణపై సమీక్షించారు. ఎంఆర్‌పల్లె లోని పోలీస్ పరేడ్ మైదానంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

వాకాడు, ఆగస్టు 2: మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని శుక్రవారం ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ ఘట్టాలను వేదపండితులు దివి అనంతాచార్యులు భక్తులకు వివరిస్తూ జరిపించారు. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిబాబా స్వామి, సాక్షానందస్వామి, సులభాదేవి, పరిపూర్ణానందస్వామి, గురుబిడ్డలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు పూర్తయ్యేనా?


అసంపూర్తిగా ఉన్న తడకండ్రిగ సచివాలయం-2

తడ, ఆగస్టు 2 : గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థకు అవసరమైన కార్యాలయాల్లో కొన్ని అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. తడ మండలంలో మొత్తం 18 పంచాయతీలకుగాను 16 సచివాలయాలు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. అప్పటికప్పుడు కొన్నిచోట్ల తాత్కలిక భవనాల్లో ఈ సచివాలయాలను ఏర్పాటు చేశారు. 2020లో ప్రారంభమైన ఈ సచివాలయ వ్యవస్థకు అవసరమైన భవన నిర్మాణాలకు అప్పట్లో ప్రభుత్వం అనుమతించింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.45 లక్షలుగా నిర్ణయించింది. ఈ మేరకు వైసీపీ నాయకులు వాటి నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకున్నారు. కొన్ని సచివాలయా భవనాలు పూర్త య్యాయి. అయితే వాటి బిల్లులను ప్రభుత్వం సరిగా విడుదల చేయకపోవడంతో తమకు బిల్లుల మంజూరు కావేమోనని కొన్నింటిని అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఈ పరిస్థితుల్లో ఆ భవన నిర్మాణాలు పూర్తి అవుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకమే. వాటిని ప్రభుత్వానికి అప్పగించాల్సింది వైసీపీ నాయకులు కావడంతో ఈ నిర్మాణాలపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. అయినా 6 నెలల్లో పూర్తి చేసి ప్రారంభించాల్సి భవనాలను నాలుగేళ్ల పాటు పూర్తి కాకపోయినా అప్పట్లో వైసీపీ ప్రభుత్వమే పట్టించుకోలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వంపై అది అదనపు భారమే అవుతుందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

త్వరలో టిడ్కో ఇళ్ల పంపిణీ: కురుగొండ్ల


టిడ్కో గృహాల వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కురుగొండ్ల తదితరులు

వెంకటగిరి, ఆగస్టు 2: అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను రూ.11 కోట్లతో పూర్తి చేయించి లబ్ధిదారులకు అందిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. తిరుపతి - వెంకటగిరి రోడ్డు మార్గంలో ఉన్న టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న వారు అక్కడి సమస్యలను ఆయన దృష్టికి తీసుకు రావడంతో శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇళ్ల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉండడంతో వాటిని ఆయన స్వయంగా తొలగించారు. నెలలో ఒక్క రోజు చుట్టుపక్కల వాళ్లు శ్రమదానం చేస్తే పరిసరాలు శుభ్రంగా ఉంటాయని చెప్పారు. అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించి సంబంధిత అధికారులను సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఓ ఇంటికి టూలెట్ బోర్డును పెట్టడాన్ని గుర్తించిన ఆయన వెంటనే ఆ ఇంటి యజమానికి ఫోన్ చేశారు. ప్రభుత్వం ఇల్లు కేటాయించింది బాడుగలకు ఇవ్వడానికి కాదన్నారు. తమకు కేటాయించిన ఇంటిని ఎవరైనా అద్దెకు ఇచ్చినట్టు తేలితే దాన్ని రద్దు చేసి అర్హులకు కేటాయిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు పి.రాజేశ్వరావు, బి.రాజేశ్వరావు, ఏ.సత్యనారాయణ, పి.చంద్రమౌళిరెడ్డి, మల్లారం బాబు, గల్లా శ్రీనివాసులు సహా మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, టిడ్కో ఈఈ ఉమాశంకర్ శాస్త్రి, డీఈ రంగయ్య, ట్రాన్స్‌కో ఏఈ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు... వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రత్యే నిధులను కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. కళశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందించారు. కళాశాలలో ఎనిమిది అదనపు గదులు, కంప్యూటర్ ల్యాబ్ సహా పది కంప్యూటర్లను సమకూర్చాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రవీంద్రబాబు ఎమ్మెల్యేను కోరారు. మధ్యాహ్న భోజన పథకం, వివాదంలో క్రీడా ప్రాంగణాన్ని విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే చెప్పారు.

ఇస్రో భావి శాస్త్రవేత్తలు మీరే

షార్ డైరెక్టర్ రాజరాజన్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట, ఆగస్టు 2: సమాజానికి ఉపయోపడే పరిశోధనలు చేయాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం పుదుచ్చేరిలోని ఆచార్య ఇంజినీరింగ్ కళాశాలలో భారత ప్రభుత్వం, ఇస్రో, షార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 వంటి సంక్లిష్టమైన ప్రయోగాన్ని భారత్ సుసాధ్యం చేసి చూపించిందన్నారు. ఈ ప్రయోగం భవిష్యత్తులో చేపట్టే ప్రయోగాలకు స్ఫూర్తిదాయకమన్నారు. గగన్‌యాన్, చంద్రయాన్-4 ప్రయోగాలే తమ ముందున్న లక్ష్యమని ఇదే స్ఫూర్తితో శాస్త్రవేత్తలు కూడా పనిచేస్తున్నారన్నారు. భావి శాస్త్రవేత్తలను తయారు చేయడానికే స్పేస్ డే సంబరాలు నిర్వహించి ఇస్రో చేపట్టే ప్రయోగాలు, ఉపగ్రహాలు రూపలకల్పన తదితర వాటి గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలపై ఆసక్తి కలుగుతుందన్నారు. అనంతరం ఆయన కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పేస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల రూపకల్పన, వాటి పనితీరు తదితరాలను వీడియో ద్వారా ప్రదర్శించారు. షార్ సీనియర్ ఉద్యోగులు, కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతోనే క్యాన్సర్


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మి

గూడూరు, ఆగస్టు 2: మన జీవనశైలిలో మార్పుల కారణంగా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ అధికారి లక్ష్మి అన్నారు. పట్టణంలోని త్యాగరాజవీధిలో ఉన్న ప్రైవేటు ఫంక్షన్‌హాలులో సునీత సేవా సంస్థ సహకారంతో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్లాస్టిక్ కవర్లలలో వేడిపదార్థాను తినడం, జంక్‌ఫుడ్, రసాయన అవశేషాలు ఉన్న కూరగాయలు తినడం వలన, పొగాకు, మద్యం వినియోగించడం వలన క్యాన్సర్ వస్తుందన్నారు. సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి, కన్యాకుమారి, ఉమాదేవి, పద్మజ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: విపరీతంగా మరిగిన నూనెలతో చేసే వంటకాలను తింటే క్యాన్సర్ వస్తుందని స్విమ్స్ వైద్యాధికారి ఏ.వి. చైతన్యభాను అన్నారు. తిరుపతి స్విమ్స్ వైద్య బృందం ఆధ్వర్యంలో నాయుడుపేట మండలం విన్నమాల, శ్రీనివాసపురంలలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి నోరు, రొమ్ముభాగం, గర్భాశయం, ఊపిరితిత్తులు, వృషణాల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వికాస్, శంకరయ్య, జి. హరిత, చంద్రమోహన్, టీడీపీ తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి రాజేంద్ర, నాయకులు ఆళ్ల రాజారెడ్డి, శ్రీనివాసులు, న్యాయవాది పనబాక గంగరాజు, గంగబాబు, పంచాయతీ కార్యదర్శి గోవిందయ్య, వీఆర్వో మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా పార్వతీ దేవి


కూరగాయల అంకరణలో పార్వతీదేవి - నారాయణమ్మ ఆలయానికి కూరగాయల అలంకరణ

సూళ్లూరుపేట/ గూడూరు, ఆగస్టు 2: సూళ్లూరుపేట పట్టణంలోని గంగా పార్వతీ సమేత త్రినేత్ర సంభూత నాగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పార్వతీదేవిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గూడూరు పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం ఆషాఢ మాసం శుక్రవారం పూజలను నిర్వహించారు. స్థానిక సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి శాకంబరిగా పూజలు జరిపారు. స్థానిక రాజరాజేశ్వరిదేవి, కన్యకాపరమేశ్వరిదేవి తదితర అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఎస్సీ వర్గీకరణ సానుకూలతపై హర్షం

గూడూరు అర్బన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం సానుకూలంగా వ్యవహరించడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పోస్టాఫీసు సమీపంలోని అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు సాగించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి న్యాయం చేయాలన్నారు. శ్రీనివాసులు, పెంచలయ్య, పౌలు, సుందరం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: ఎస్సీ నోటిఫికేషన్‌ను కేంద్రప్రభుత్వమే జారీ చేయాలని న్యాయవాది హరి కోరారు. ఎస్సీల నోటిఫికేషన్ పరిధి ప్రతి రాష్ట్రానికి మారుతుందన్నారు. ఆయా రాష్ట్రాలకు సంబంధించి రాష్ట్రపతి నిర్ధారించి అధి కారికంగా నోటిఫై చేయాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్‌లో మెజార్టీ పొంది 341 ఆర్టికల్‌కు సవరించి వర్గీకరించాల్సి ఉంటుందన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి

ఓజిలి, ఆగస్టు 2: తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి మెండుగా ఉంటుందని, పుట్టిన బిడ్డకు టీకా వంటిదని నాయుడుపేట సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. ఓజిలి మండలంలోని ఆరిమేనిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలాయపల్లి మండలం మస్తకావేరి, గూడూరు పట్టణం, కోట మండలం విద్యానగర్, చిల్లకూరు మండలం తిక్కవరం ఎస్టీకాలనీలో, వాకాడు మండలంలో, చిట్టమూరు మండలం మండలంలోని గునపాడు, పెళ్లకూరుల్లో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి

చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చండి


మంత్రి నారాయణలో నాగేంద్రప్రసాద రెడ్డి తదితరులు

పెళ్లకూరు, ఆగస్టు 2: మండలంలోని అత్యధిక ఆయకట్టు కలిగిన చెంబేడు చెరువును ఆధునికీకరించి మినీ రిజర్వియర్‌గా మార్చాలని సర్పంచుల సంఘ రాష్ట్ర కార్యదర్శి డి.నాగేంద్రప్రసాద రెడ్డి శుక్రవారం అమరావతిలో రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి జలవనరుల శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా శిరసనంబేడు, సీఎన్‌పేట, బంగారంపేట పునబాక తదితర గ్రామాలలో వందలాది ఎకరాలు పరిశ్రమల స్థాపన కోసం గత టీడీపీ ప్రభుత్వం సేకరించిందని ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో కలసి మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

సూళ్లూరుపేట, ఆగస్టు 2: చోరీ కేసులో నిందితుడి మల్లు మునస్వామిని శుక్రవారం శ్రీహరికోట పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 29న మండల పరిధిలోని అట్టకానితిప్ప గ్రామంలో హెచ్.లక్ష్మి ఇంట్లో చోరీ జరిగింది బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీహరికోట ఎస్‌ఐ రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన మల్లు మునస్వామిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి నుంచి 6 సవర్ల బంగారు ఆరణాలతో పాటు రూ.3 వేలు నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ఇన్‌చార్జి తహసీల్దారు లేకుండా...!

ఓజిలి, ఆగస్టు 2 : మండలానికి ఇన్‌చార్జి తహసీల్దారు లేరంట.. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన నాంచారయ్య గత నెల 27న బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అయితే ఇన్‌చార్జి తహసీల్దారు బాధ్యతలను అప్పగించాలేదు. మండలం నుంచి బదిలీపై వెళ్తూ తహసీల్దారు నాంచారయ్య ఇక్కడి డిప్యూటీ తహసీల్దారు మధుసూదనరాజుకు చార్జి అప్పగించారు. అయితే ఇన్‌చార్జి బాధ్యతలు మాత్రం తనకు అప్పగించలేదని డిప్యూటీ తహసీల్దారు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 2: నియోజకవర్గ పరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఐదుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను, ఒక మహిళకు కుట్టు మెషిన్‌ను అందజేశారు. ఎల్ఎస్ ప్రాజెక్టు నిర్వాహకుడు వాసు సహకారంతో వాటిని అందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు తన సొంత నిధుల నుంచి రూ.10వేలు అందించారు. పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పి.నాగరాజు, సిద్ధయ్యనాయుడు, భారతి, జీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అన్నక్యాంటీన్ ఏర్పాట్లును ఎమ్మెల్యే పరిశీలించారు. గ్రామసేవకుల న్యాయమైన డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడుతానని చెప్పారు. శుక్రవారం స్థానిక గ్రామసేవకుల భవనంలో గ్రామసేవకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, రమణయ్య, సుబ్బయ్య, సురేంద్ర, మల్లికార్జున్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు, ఆగస్టు 2: గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసి భ్రూణ హత్యలను తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమని, ఆడపిల్లల పట్ల వివక్ష చూపకూడదన్నారు. వైద్యశాఖ అధికారులు ప్రతినెలా స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని సెంటర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసినవారు 102, 104 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మస్తానమ్మ, వివిధశాఖల అధికారులు శిరీషా, బాబునెహ్రూరెడ్డి, సంపూర్ణ, గిరిజ, మెహబూబి, రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రైవేటు లేబోరేటరీలను డిప్యూటీ డీఎంహెచ్‌వో మస్తానమ్మ తనిఖీ చేశారు.

సీఐటీయూ ర్యాలీని విజయవంతం చేయండి

గూడూరు, ఆగస్టు 2: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 5న పట్టణంలో నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక భవననిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సుదూరప్రాంతాల నుంచి ఇసుక తీసుకురావాలంటే ట్రాక్టర్‌కు రూ.6వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రీచ్‌లను అందుబాటులోకి తీసుకువస్తే ధరలు తగ్గి పనులు పెరుగుతాయన్నారు. శంకరయ్య, శివకుమార్, రఫీ, మధు, కృష్ణయ్య, శ్రీనివాసులు, బీవీరమణయ్య, ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య చిరస్మరణీయుడు

● గురుకులం ప్రిన్సిపాల్ రూత్ రమోలా

నాయుడుపేట, ఆగస్టు 2: భారతదేశ జెండా రూపకర్త పింగళి వెంకయ్య చిరస్మరణీయుడని పుదూరు బాలికల పాఠశాల, కళాశాల గురుకులం ప్రిన్సిపాల్ రూత్ రమోలా అన్నారు. శుక్రవారం పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయనకు గురుకులంలో నివాళి అర్పించారు. 19 సంవత్సరాల వయసులోనే వెంకయ్య ఆర్మీలో చేరారన్నారు. బ్రిటన్ జాతీయజెండాకు వందనం చేయాల్సి వచ్చినప్పుడు ఆయన మదిలో భారతీయ జెండా రూపుదిద్దుకుందన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ జెండా ఆవిష్కర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా రూపకల్పన, జాతిపిత మహాత్మగాంధీతో పింగళి ఉన్న సన్నిహిత సంబంధాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శర్మ వివరించారు. అధ్యాపకులు విక్టోరియా రాణి, శ్రీనివాస్, జీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



కోట, ఆగస్టు 2: పట్టణంలోని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం పలు పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. 1 నుంచి 10 తరగతులకు సంబంధించిన 77 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, పాఠశాలలతోపాటు గురుకుల పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. అదే విధంగా పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కూడా ఎంఈవో దారా మస్తానయ్య పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు ఉన్నారు.

న్యాణమైన భోజనం అందించేలా చర్యలు

గూడూరు, ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపట్టినట్లు ఎంఈవో కాంచన తెలిపారు. శుక్రవారం చవటపాళెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జనసేన నాయకులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తాగునీటి సమస్యపై జనసేన నాయకులు ఫిర్యాదు చేశారని ఈమేరకు తనిఖీ చేశామన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడి సమస్యను పరిష్కరించామన్నారు. త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఇంద్రవర్ధన్, చంద్రనీల్, రాజశేఖర్, సూర్యప్రతాప్, విష్ణు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత రాజశేఖర్‌రెడ్డే
ఇసుక మాఫియాకు మురా మేస్త్రీ
టీడీపీ నేతలపై అసత్య ప్రచారాలు మానాలంటూ పెనుమల్లం గ్రామస్తుల డిమాండ్


స్వర్ణముఖి నదిలో వైసీపీ నేత కారును అడ్డుకున్న పెనుమల్లంవాసులు

ఏర్పేడు, ఆగస్టు 2: పెనుమల్లం గ్రామానికి చెందిన వైసీపీ నేత రాజశేఖర్‌రెడ్డే ఇసుక మాఫియాకు మురామేస్త్రీ అని పెనుమల్లం గ్రామస్తులు ఆరోపించారు. ఆయన పొలంలో టీడీపీ వారు వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలించారంటూ జగన్ పత్రికలో అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ గ్రామస్తులు మండిపడ్డాడు. గత ఐదేళ్ల వైసీపీ కాలంలో ఇసుకను తరలించిన గుంతలను చూపి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తోడినట్లు ప్రచారం చేయడానికి పూనుకున్నారంటూ స్వర్ణముఖి నది ప్రాంతంలో రాజశేఖర్‌రెడ్డితో వచ్చిన జగన్ పత్రిక ప్రతినిధులను పెనుమల్లం గ్రామస్తులు అడ్డుకున్నారు. రాజశేఖర్‌రెడ్డి పొలంలో ఎక్కడ ఇసుక తరలించారో చూపించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్ల కాలంలో పాపానాయుడుపేట పరిసర గ్రామాలైన పెనుమల్లం, పెనగడం, చెన్నంపల్లి, కొత్తకాలవ, వికృతమాల, ఎండీపుత్తూరు, మర్రిమంద, మునగలపాళెం, గోవిందవరం, తదితర గ్రామాల్లో వైసీపీ నేత రాజశేఖర్‌రెడ్డి చెప్పిందే వేదవాక్కుగా జరిగిందని, ఆయన కన్నుసన్నల్లోనే లక్షలాది ట్రాక్టర్లలో ఇసుకను తరలించడం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం


పోషక పదార్థాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో, సీడీపీవో

శ్రీకాళహస్తి, ఆగస్టు 2: తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీడీపీవో శాంతిదుర్గ, ఎంఈవో భువనేశ్వరి అన్నారు. మండలంలోని కమ్మకొత్తూరు గ్రామంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టాలని, అంతేకాకుండా ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆ తరువాత రెండు సంవత్సరాల వరకు తల్లిపాల అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. దీంతో పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరగడంతో పాటు, మహిళలకు రొమ్ము క్యాన్సర్‌ను అరికట్ట వచ్చన్నారు. అనంతరం గర్భిణిలకు సీమంతం నిర్వహించి పోషక పదార్థాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈ చందన, సూపర్‌వైజర్ ఉష, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని రోటరీక్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో తల్లులకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు శైలజ, సిద్దుల గారి ప్రసాద్, కండ్రిగ ఉమ, ప్రమీల, వేణుగోపాల్, భార్గవమూర్తి, చీరాల సిల్క్స్ రమేష్‌బాబు, జనార్ధన్, సదాశివం, శ్యామ్‌ప్రసాద్, గుర్రపశెట్టి, బీజే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ఏర్పేడు, ఆగస్టు 2: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఏఎన్ఎం రీటా అన్నారు. ఏర్పేడు మండలం సీతారాంపేట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి పుట్టిన బిడ్డలకు తల్లిపాలు అందించాలన్నారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ సంధ్యాలక్ష్మి, ఆశా లోరా తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్ కల్పలత, సుమతి బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలను అందించడం ద్వారా రోగనిరోధశక్తి పెరుగుతుందన్నారు.

అర్ధనారీశ్వరాలయ పనులను వేగవంతం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 2: శ్రీకాళహస్తి పట్టణ శివారులో ఉన్న అర్ధనారీశ్వరాలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆయన అర్ధనారీశ్వరాలయ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.80కోట్లతో అర్ధనారీశ్వరాలయ పనులను గత పాలకమండలి ప్రారంభించిందన్నారు. అదే విధంగా ఏడుంగంగమ్మల ఆలయ అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఆలస్యం కావడంతో తాను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి లేఖ రాయగా స్పందించిన ఆయన పనులను వేగవంతం చేశారన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శాస్త్రోక్తంగా వసంతోత్సవం


సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 2: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఆడి కృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామికి చందన, క్షీర తదితర అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం ధ్వజావరోహణం నిర్వహించారు.

విమానాశ్రయానికి వెళ్తే పార్కింగ్ రుసుం కట్టాల్సిందే

రేణిగుంట, ఆగస్టు 2: రేణిగుంట విమానాశ్రయంలో నిబంధనలకు విరుద్ధంగా దౌర్జన్యంగా పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రయాణికులను పికప్, డ్రాప్ చేసేందుకు ప్రతిరోజూ రేణిగుంట విమానాశ్రయానికి వాహనాలు వచ్చి వెళుతుంటాయి. ఇందులో సొంత వాహనాలతో పాటు అద్దె కార్లు, ఆటోలు ఉంటాయి. విమానాశ్రయ నిబంధనల మేరకు 10 నిమిషాలు లోపు వెళ్లిపోయే వాహనాలకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే పార్కింగ్ కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి నిబంధనలు పాటించడంలేదని, విమానాశ్రయానికి వస్తే పార్కింగ్ రుసుం చెల్లించాల్సిందేనంటూ చెబుతున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విమానాశ్రయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. విమానాశ్రయ డైరెక్టర్ స్పందించి దౌర్జన్యంగా పార్కింగ్ రుసుం వసూళ్లకు పాల్పడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక


జనసేనలో చేరిన వారితో వినుత

శ్రీకాళహస్తి, ఆగస్టు 2: శ్రీకాళహస్తి మండలం వెలంపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సాని అనంత్ తన అనుచరులతో కలిసి శుక్రవారం వైసీపీలో చేరారు. వారికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

8న ఆదర్శ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక

కేవీబీపురం, ఆగస్టు 2: ఆదర్శ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక ఈనెల 8న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించామన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 5వ తేదీలోగా రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. 8వ తేదీ ఉదయం 7గంటల నుంచి 1గంట వరకు ఎన్నికలు నిర్వహించి, అదేరోజు సాయంత్రం ఫలితాలను ప్రకటిస్తాలమన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 2: పరిసరాల శుభ్రతతో పాటుగా వ్యక్తి గత శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని కార్యదర్శి ఇందిరమ్మ అన్నారు. బుచ్చినాయుడుకండ్రిగలో డ్రైడేను పురష్కరించుకుని శుక్రవారం వీధుల్లోని మురుగు కాలువలు శుభ్రం చేసి కోర్లినేషన్ చేశారు. ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయించారు. వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. అనంతరం పురవీధుల్లో పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు: సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 2: శ్రీకాళహస్తి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయనున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. పురపాలక సంఘం అధికారులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పట్టణంలోని ఓటేరుకాలువ, నాగులగుంట కాలువ, చెంబేడు కాలువ, కన్నలి కాలువ, గొడ్డేరు కాలువ, నక్కల కాలువ ప్రాంతాలను పరిశీలించారు. అలాగే సంతామైదానం, నాగులగుంట, టింబర్‌డిపో కూడలి, సన్నిధివీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. మురుగునీటి సమస్యపై స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో అధికారుల ద్వారా డ్రైనేజీ మ్యాప్‌లను పరిశీలించి ప్రక్షాళనపై చర్చించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని ఎన్నికలకు ముందు ప్రజలు విజ్ఞప్తి చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన కోసం పురపాలక మంత్రి నారాయణకు వివరించగా ఆయన వెంటనే స్పందించి రూ.50లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. 5వ తేదీన డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. నెల రోజుల వ్యవధిలోనే డ్రైనేజీ సమస్యను తొలిదశ ప్రక్షాళన పూర్తి చేయాలన్న లక్ష్యంగా పనులు ప్రారంభిస్తామన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనతో పాటు దోమల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం నిధుల కోసం విజ్ఞప్తి చేస్తామని వివరించారు.


సంతమైదానంలో ఓటేరు కాలువను పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు మునిరాజ నాయుడు, కంఠా రమేష్, కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా ధ్వజావరోహణం


ధ్వజావరోహణం పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 2: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆగమోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమం జరిగింది. ఆలయంలోని చెంగల్వరాయ సన్నిధి వద్ద స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ధ్వజావరోహణపూజలు నిర్వహించారు. కాగా, శనివారం రాత్రి పల్లకీసేవ జరగనుంది.

ప్రైవేట్ ల్యాబ్‌లలో తనిఖీలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 2: పట్టణంలోని పలు ప్రైవేట్ ల్యాబ్‌లను శుక్రవారం శ్రీరామ్‌నగర్‌కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు బాలు, శైలజ తనిఖీ చేశారు. రోగుల నుంచి అధికంగా ధరలు వసూలు చేసినా, అనవసరంగా పరీక్షలు చేసి లేని రోగాలను ఉన్నట్లు చూపించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక శ్రీరామ్‌నగర్ కాలనీలో గల పట్టణ ఆరోగ్యకేంద్రంలోని ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షలు చేస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పరశురామేశ్వరుడి సేవలో హ్యూమన్‌రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్

ఏర్పేడు, ఆగస్టు 2: గుడిమల్లంలోని పరశురామేశ్వర స్వామి దేవాలయాన్ని హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి నయని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అధికారులు, వేదపండితులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.



కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన

శ్రీకాళహస్తి, ఆగస్టు 2: శ్రీకాళహస్తి మండలం ఎంపేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వాగివేడు గ్రామంలో జాతీయ కుష్ఠువ్యాధి నివారణపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కుష్ఠు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి పక్షం రోజుల పాటు కుష్ఠువ్యాధి సర్వే జరుగుతుందన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలు, లావుగా ఉబ్బిన నొప్పితో కూడిన నరాలు, బొడిపలు, నొప్పిలేని పుండ్లు ఉంటే కుష్ఠువ్యాధి లక్షణాలుగా గుర్తించి సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమణ, సుధీర్‌కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠురహిత సమాజం కోసం కృషి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 2: కుష్ఠురహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని జిల్లా కుష్ఠు, క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కుష్ఠువ్యాధి సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు ఆరు మాసాలు పాటు అందించడం జరుగుతుందని, క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ర్యాంకు కార్డు ఇంకా రాలేదు
విద్యా సంవత్సరం నష్టపోతానని విద్యార్థి ఆందోళన


పవన్ కల్యాణ్

ఏర్పేడు, ఆగస్టు 2: ఈఏపీసెట్‌లో ర్యాంకు సాధించినప్పటికీ విద్యాశాఖ నుంచి కార్డు అందక ఏర్పేడు మండలానికి ఓ విద్యార్థి ఆందోళన చెందుతున్నాడు. ఇసుకతాగేలి పంచాయతీ బీసీకాలనీ చెందిన మునిరెడ్డి, రాణి దంపతుల కుమారుడు పవన్ కల్యాణ్ శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 2024కు సంబంధించి ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీసెట్) రాసి 45,999వ ర్యాంకు సాధించాడు. అయితే ఇప్పటివరకు విద్యాశాఖ ర్యాంకు కార్డును పంపకపోవడంతో విద్యాసంవత్సరం నష్టపోతానని ఆందోళన చెందుతున్నాడు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీకి మెయిల్ పంపినా, ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో పరిశీలించగా నో రిజల్ట్ ఫౌండ్ అని చూపుతోందని చెబుతున్నాడు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకుని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చి తమ కుమారుడి భవిష్యత్తును కాపాడాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించండి

వరదయ్యపాళెం, ఆగస్టు 2: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు మురళి, నాగార్జున మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించడంలేదని తెలిపారు. రాత్రి వేళల్లో ఎవరూ వైద్యసిబ్బంది ఉండటం లేదని, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా అందుకు అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు.

పంట నమోదు చేసుకోండి

కేవీబీపురం, ఆగస్టు 2: మండలంలోని రైతులందరూ ఈ - పాస్ ద్వారా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి మురళీకృష్ణ చెప్పారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో బీజేపీ మండలాధ్యక్షుడు మునిశేఖర్ ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయాధికారిని కలిశారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతులందరికీ అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, వెంకటకృష్ణయ్య, వెంటకముని, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

ఏర్పేడు, ఆగస్టు 2: ఏర్పేడు మండలం పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు విద్యాసామగ్రి, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా అంబేడ్కర్ స్టార్ కృష్ణ పేద విద్యార్థులకు విద్యాసామగ్రి, దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య, నాయకులు వేమూరి బాలాజీనాయుడు, మోహన్ నాయుడు, హేమాక్షి, అర్జునబాబు, లతా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రిజర్వేషన్ల వర్గీకరణకు సిట్టింగ్‌తో కమిటీ వేయాలి


చిరంజీవి

పుత్తూరు, ఆగస్టు 2: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు విధివిధానాల రూపకల్పనకు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇరువురం చిరంజీవి శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధమేనని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వున్న గిరిజన కులాలను పరిగణలోకి తీసుకుని సమన్యాయం చేయాలని కోరారు. అలాగే ఉప కులాల జనాభా, ఆర్థిక, విద్య, సంక్షేమాలను ప్రాథమిక ప్రమాణాలుగా తీసుకోవాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 2: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు కోరారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ లేదా పీజీ చేసి, నెట్ లేదా స్లెట్ పాసైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 7లోగా బయోడేటాతో పాటు జిరాక్స్ సర్టిఫికెట్లు కళాశాలలో అందజేయాలని, 8న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరుకావాలని అన్నారు.

పింగళి వెంకయ్య జయంతి


పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

వడమాలపేట, ఆగస్టు 2: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు జాతీయ పతకాలు చేతబట్టి జయభారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు.

ప్రాచీన మర్మకళ చికిత్సతో
దీర్ఘకాలిక వ్యాధులు నయం

పుత్తూరు/పుత్తూరు టౌన్, ఆగస్టు 2: ప్రాచీన మర్మకళ వైద్య విధానంతో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చని డాక్టర్ హరిప్రసాద్ రావిళ్ల తెలిపారు. పుత్తూరులోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం మర్మకళ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరచేయి, పాదాల్లో వున్న ఏడు వేల నాడుల చివర ఒత్తిడి చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రతి నెలా నిర్వహించే మర్మకళ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కరరాజు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వామన్, సంఘ నాయకులు కుప్పయ్య, రామలింగం పాల్గొన్నారు.


మర్మకళ చికిత్స చేస్తున్న వైద్యులు

వైభవంగా మహా రుద్రాభిషేకం


విశేష అలంకరణలో మహాశివుడు

వడమాలపేట, ఆగస్టు 2: స్థానిక భవానీ శంకర్ దేవాలయంలో మహాశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో పంచామృత అభిషేకం చేశారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో రుద్రహోమం, శాంతి హోమం చేశారు. మహాశివుని లింగాన్ని పూలమాలలతో విశేషంగా అలంకరించి మంగళ హారుతలిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ట్యాంకును శుభ్రపరచండి

పుత్తూరు, ఆగస్టు 1: పుత్తూరు మండలం కేబీఆర్ పురం గ్రామంలోని మంచినీటి సరఫరా ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిచ్చెన విరిగిపోవడంతో గత రెండేళ్లుగా ట్యాంకును శుభ్రం చేయలేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిచ్చెనకు మరమ్మతులు చేసి ట్యాంకును శుభ్రపరచాలని కోరుతున్నారు.

అధికారుల పనితీరులో మార్పు రావాలి

వడమాలపేట, ఆగస్టు 2: మండల అధికారుల పనితీరులో మార్పు రావాలని జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఆర్ పురం సర్పంచు మణిరాజు మాట్లాడుతూ పంచాయతీల్లో నిధులలేమితో అభివృద్ధి కుంటుపడుతోందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు వచ్చే నిధులకు సంబంధించి కార్యదర్శులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవి అలంకరణలో వాసవాంబ



వడమాలపేట, ఆగస్టు 2: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి శాకాంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా వాసవీదేవిని వివిధ రకాల కూరగాయలతో సుందరంగా అలంకరించారు. మంగళ హారుతులిచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు నారికేల కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాజప్ప గురుకుల్ మృతి

పుత్తూరు, ఆగస్టు 2: నారాయణవనంలోని శివాలయ అర్చకస్వామి రాజప్ప గురుకుల్ శుక్రవారం మృతి చెందారు. ఆయన మరణం పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.